

గడువు

పది రోజులే..

నవంబరు 6 వరకే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్ల నమోదు

- నత్తనడకన ఎన్‌రోల్‌మెంట్
- ఆసక్తి చూపని గ్రాడ్యుయేట్లు
- పెరగనున్న ఉపాధ్యాయ ఓట్లు
- హోరాహోరీగా ఆశావహుల ప్రచారం
- రసవత్తరంగా మండలి పోరు
- కరీంనగర్–ఆదిలాబాద్–నిజామాబాద్–మెదక్ ఎమ్మెల్సీ ఎన్నిక



సిద్దిపేటలో పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, అక్టోబరు 27: ఆరేళ్ల క్రితం 2019 మార్చి నెలలో కరీంనగర్-మెదక్- ఆదిలాబాద్-నిజామాబాద్ శాసనమండలి ఎన్నికలు జరిగాయి. అప్పుడు పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ నేత జీవన్‌రెడ్డి విజయం సాధించగా.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కూర రఘోత్తంరెడ్డి గెలుపొందారు. వచ్చే మార్చి 29వ తేదీతో వీరి పదవీకాలం ముగియనుంది. అప్పటి లోగా ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తిచేసి మళ్లీ ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది. నవంబరు 6 వరకు నమోదు ముగుస్తుండగా.. డిసెంబరు నెలలో తుది జాబితా ప్రకటిస్తారు. ఆ తర్వాత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేస్తారు.

ఆసక్తి చూపించని పట్టభద్రులు

ఓటు నమోదు ప్రక్రియపై పట్టభద్రులు ఆసక్తి చూపించడం లేదనే చర్చ జరుగుతోంది. ఆరేళ్ల క్రితం కూడా నాలుగు ఉమ్మడి జిల్లాలు కలిపి కేవలం 1,96,321 మంది గ్రాడ్యుయేట్లు మాత్రమే ఓటుహక్కు పొందారు. ఒక్క ఏడాదిలో డిగ్రీ, బీటెక్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసే వారి సంఖ్య నాలుగు జిల్లాల్లో లక్షల్లో ఉంటుంది. గత ఎన్నికల నాటికి 10 లక్షల మందికి తక్కువ కాకుండా పట్టభద్రులు ఉన్నా ఓటర్ల సంఖ్య కనీసం 2లక్షలు కూడా దాటకపోవడం గమనార్హం. ఆరేళ్ల తరువాత జరుగుతున్న ఈ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. కానీ ఇప్పుడు కూడా ఓటుహక్కు నమోదు చేసుకోవడానికి నిరాసక్తత కనబరుస్తున్నారు. ఆన్‌లైన్‌లోనూ నమోదు చేసుకునే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదు. రెవెన్యూ కార్యాలయాల్లోనూ ప్రత్యేక కౌంటర్లు

మిగతా 7వ పేజీలో...

ఆరేళ్లకోసారి జరిగే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికలో ఓటేసే అవకాశం పొందాలంటే మరో 10 రోజుల సమయమే మిగిలి ఉంది. ఓటరుగా నమోదుకు వచ్చే నెల 6వ తేదీ వరకే గడువుంది. గడిచిన సెప్టెంబరు 30వ తేదీ నుండి ఓటర్ల నమోదు ప్రక్రియ మొదలైంది. ఫారం-18 ద్వారా పట్టభద్రులు, ఫారం-19 ద్వారా ఉపాధ్యాయులు తమ వివరాలను సమర్పించి ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాల్సి ఉంది. అయితే, అధికారుల వైపు నుంచి ఓటరు నమోదు ప్రక్రియ గురించి మొక్కుబడిగానే అవగాహన కార్యక్రమాలు ఉంటున్నాయి. ఓటు నమోదుపై ఆయా వర్గాల్లో చైతన్యం తెచ్చే ప్రయత్నాలు జరగడం లేదనే విమర్శలు నెలకొన్నాయి.

సైనికుల పహారాతోనే ప్రశాంత జీవనం

కొన్ని దేశాల్లో బ్రెడ్డు కోసం కొట్లాడుతుంటే మన దేశంలో ఆహారాన్ని వృథా చేస్తున్నాం : ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

గజ్వేల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సైనికుల పహారాతోనే దేశంలో ప్రశాంత జీవనం సాధ్యమవుతుందని మెదక్ పార్లమెంట్ సభ్యుడు ఎం.రఘునందన్‌రావు అన్నారు. గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన ఆజాద్ డిఫెన్స్ అకాడమీ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులకు, కుటుంబాలకు, గ్రామానికి దూరంగా దేశం బాగుండాలని పనిచేసేది కేవలం సైనికులు మాత్రమేనన్నారు. ఆయనవెంట ఆజాద్ అకాడమీ నిర్వాహకులు నీల చంద్రం తదితరులున్నారు. గజ్వేల్ పట్టణంలోని ఓ సమావేశ మందిరంలో మాతృభూమి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఆహారం వృథాను నివారించడం' అంశంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు ఫంక్షన్‌హాల్స్‌లో భోజనాన్ని తినే తీరు బాధాకరంగా ఉంటుందని, ఆహారాన్ని కింద ఎక్కడపడితే అక్కడ పడేస్తారని ఎంపీ ఆవేదన వ్యక్తం చేశారు. సోమాలియా, మంగోలియా దేశాల్లో బ్రెడ్డు కోసం కొట్లాడుతున్నారని అనేక వార్తల్లో వింటున్నామని, కానీ మన దేశంలో ఇష్టారీతిన ఆహారాన్ని వృథా చేస్తున్నారన్నారు. భోజనం చేసే సమయంలో క్రమశిక్షణను అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు మాదాడి జశ్వంత్‌రెడ్డి, మాతృభూమి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు డాక్టర్ వాసవాచారీ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' రిజర్వేషన్లపై అభిప్రాయ సేకరణ

30న సంగారెడ్డి కలెక్టరేట్‌కు బీసీ కమిషన్ బృందం

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై 30న సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల కమిషన్(బీసీ) బృందం ప్రజాభిప్రాయాన్ని సేకరించనున్నదని సిద్దిపేట కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించనున్నదని ఆయన పేర్కొన్నారు. జిల్లా నుంచి ఆసక్తి కలిగిన వారు తమ అభిప్రాయాలను కమిషన్ ఎదుట ఉంచాలని సూచించారు. నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్ ఆరు సెట్లను తెలుగు, ఇంగ్లీష్ భాషలలో ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. తమ అభ్యర్థనలకు బలం చేకూర్చేలా తమ వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను, సంబంధిత కేసుల వివరాలను పేర్కొనవచ్చుని కలెక్టర్ పేర్కొన్నారు.

విశేష పుష్పాలంకరణతో మల్లన్న దర్శనం

సంపంగి, రుద్రాక్ష, వటవేర్లు, యాలకులు, లవంగాలు, గులాబీలు, తెల్ల జుల్లేరు పూలు, బిల్వ పత్రి, చామంతులు, తగర, క్యాబ్ గులాబీల మాలలతో ఆదివారం కొమురవెల్లి మల్లన్నను స్వామివారిని అలంకరించారు. హైదరాబాద్‌కు చెందిన జైపాల్‌యాదవ్ అనే భక్తుడు ప్రత్యేక మాలలను సమర్పించి భక్తిప్రపత్తులు చాటుకున్నాడు.

- చేర్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి)


యాదాద్రి తరహాలో కొమురవెల్లి ఆలయాభివృద్ధి

- కల్యాణంలోగా అమ్మవార్లకు బంగారు కిరీటాలు
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



కుటుంబసభ్యులతో మంత్రి కొండా సురేఖ

చేర్యాల, అక్టోబరు 27: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాన్ని యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం మాదిరిగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఆమె ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి మల్లన్న ఆలయాన్ని సందర్శించారు. మనుమడి పుట్టు వెంట్రుకలు తీయించి, పట్నం రచించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ 50 గదుల సత్రం భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. అమ్మవార్ల బంగారు కిరీటాలు తయారువుతున్నాయని, కల్యాణంలోగా పూర్తిచేయించి అలంకరింపచేస్తామన్నారు.





దూరాన గుట్టల మధ్య అస్తమిస్తున్న సూర్యుడు.. పచ్చని చెట్లు, పొలాలు.. వాటి మధ్య కనిపిస్తున్న సెలయేరు.. ఎర్రటి తివాచీని పరిచినట్లుగా ఉన్న ఆకాశం.. ఈ దృశ్యాలు రాజీవ్‌రహదారి నుంచి కొండపాకకు వెళ్లే మార్గంలో కనువిందు చేశాయి. అటువైపు నుంచి వెళుతున్న వారు తమ సెల్‌ఫోన్లలో బంధించి ఆనందించారు.

- కొండపాక, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి)

బోనస్‌పై ఆశలు

జిల్లాలో 65 వేల ఎకరాల్లో సన్న వరి సాగు

కొనుగోలుకు 66 ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వర్షాకాలం ధాన్యం సేకరణకు పౌరసరఫరాల శాఖ సమాయాత్తమవుతున్నది. నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు 417 కేంద్రాలను ప్రారంభించనున్నారు. ఇప్పటికే జిల్లాలో 276 చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఈసారి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు సన్న రకం ధాన్యానికి బోనస్ చెల్లిస్తామనడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. రాష్ట్ర ప్రభుత్వం సన్నాలు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించేందుకు చర్యలు చేపట్టింది. సన్నధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావడానికి మరో 10 రోజుల్లో పట్టనున్నది. సన్నాల ధాన్యం కొనుగోలు కోసం జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేకంగా 66 ఏర్పాటు చేస్తున్నారు.

మార్గదర్శకాల ప్రకారం

బోనస్ ఇవ్వడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. సన్నాల్లోని 33 రకాలకు వర్తింపజేశారు. ధాన్యం గింజ పొడువు, వెడల్పు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? సరిచూడనున్నారు. దీని కోసం ప్రతీ కొనుగోలు కేంద్రం వద్ద ఈసారి మైక్రో మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. పొడవు 6 మిల్లీమీటర్ల కంటే తక్కువ, వెడల్పు రెండు మిల్లీమీటర్ల కంటే ఎక్కువ కాకుండా ఉండాలి. తేమ శాతం 17కు మించకుండా ఉన్నప్పుడు మాత్రమే కొనుగోలు చేస్తారు.



33 సన్న రకాలు ఇవే..

సిద్ధి, కంపసాగర్ వరి-1, సాంబ మసూరి, జగిత్యాల్ వరి-3, జగిత్యాల్ వరి-2, వరంగల్ సాంబ, వరంగల్ సన్నాలు, జగిత్యాల్ మసూరి, పొలాస ప్రభ, కృష్ణ, మానేరు సోనా, తెలంగాణ సోనా, వరంగల్ వరి, కూనరం వరి-2, వరంగల్ వరి-2, ఎంటీయూ 1271, రాజేంద్రనగర్ వరి-4, కూనరం వరి-1, జగిత్యాల సన్నాలు, జగిత్యాల సాంబ, కరీంనగర్ సాంబ, అంజన, నెల్లూరు మసూరి, ప్రత్యుమ్న, సుగంధ సాంబ, శోభిని, సోమ్‌నాథ్, ఆన్‌ఆర్‌ఆర్, కేపీఎస్ 6251, జేజీఎల్ 33124, హెచ్ఎంటీ సోనా, మార్టేరు సాంబ, మార్టేరు మసూరి.

అదనంగా రూ.35 కోట్లు

ఈ సీజన్‌లో జిల్లాలో 65 వేల ఎకరాల్లో సన్నరకం వరిని సాగు చేశారు. 1.60 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానుందని అధికారులు అంచనాలు వేశారు. ఇందులో రైతుల అవసరాలకుపోగా.. 70 వేల మెట్రిక్ టన్నుల వరకు మార్కెట్‌కు తీసుకొచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు రైతులకు దాదాపు రూ.35 కోట్ల వరకు అదనంగా బోనస్ రూపంలో అందనున్నది.

మేత కోసం మెతుకుసీమకు

- మహబూబ్‌నగర్ నుంచి వేల సంఖ్యలో జీవాల వలసలు
- మెదక్-హైదరాబాద్ రోడ్డు పొడవునా గొర్రెల మందలు

7



'తుఫాన్' బోల్తా.. పదకొండు మందికి గాయాలు

- ఇద్దరి పరిస్థితి విషమం
- కల్హేర్ మండల పరిధిలోని హైవే 161పై ఘటన

7

ఆటో బోల్తాపడి ఐదుగురికి గాయాలు

- కొమురవెల్లి మండలం లెనిన్‌నగర్ గ్రామంలో ప్రమాదం

అబద్ధపు హామీలతో అధికారంలోకి

- ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మూడుసార్లు రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్
- ఇప్పుడు అసలే ఇవ్వకుండా మోసం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): అబద్ధపు హామీలనిచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 127 మంది లబ్ధిదారులకు రూ.28.65 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో రైతులకు రబీకి, యాసంగికి రైతుబంధు ఇచ్చామని గుర్తుచేశారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ మూడుసార్లు రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఒక్క పంటకు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని మండిపడ్డారు. ఆడపడచులకు రెండు బతుకమ్మ చీరలు ఇస్తామని కనీసం ఒక్కటి ఇవ్వలేదని, కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో పెట్టిందన్నారు. నిరుద్యోగ యువతకు ఏడాదిలోపు లక్ష ఉద్యోగాలు ఇస్తామని హామీనిచ్చి, అధికారంలోకి వచ్చి 11 నెలలు కావొస్తున్నా, 25 వేల ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్ ఇవ్వలేదని చెప్పారు. అక్కచెల్లెళ్లకు రూ.2,500 ఇస్తామని బాండ్‌పేపర్ కూడా రాసిచ్చారని, ఇప్పటివరకు దాని ఊసేలేదన్నారు. కేసీఆర్ హయాంలో సర్కార్ దవాఖానాల్లో ఆడపిల్ల పుడితే రూ.13 వేలు, కేసీఆర్ కిట్ ఇచ్చి తల్లిబిడ్డను క్షేమంగా ఇంటి వద్ద దింపేవారమని గుర్తుచేశారు. నమ్మి ఓటేస్తే గొంతుకోస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్, నాయకులు రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేస్తున్న హరీశ్‌రావు



ఆర్టీఏ యూనిట్ కార్యాలయ నిర్మాణానికి చదును చేసిన స్థలం

చెరువు పక్కనే ఆర్టీఏ కార్యాలయ నిర్మాణం!

హుస్నాబాద్‌లో ఎల్లమ్మ చెరువు వద్ద స్థలం చదును.. శంకుస్థాపనకు ఏర్పాట్లు

హుస్నాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు మత్తడి సమీపంలో ఆర్టీఏ యూనిట్ (ఎంవీఐ) కార్యాలయ భవన నిర్మాణానికి స్థలాన్ని ఎంపిక చేశారు. చెరువు మత్తడి సమీపంలోని 265/1 సర్వేనంబర్‌లో రెండు ఎకరాల్లో కార్యాలయాన్ని నిర్మించనున్నారు. త్వరలో శంకుస్థాపన చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు రోజులుగా ఈ స్థలాన్ని చదును చేస్తున్నారు. హుస్నాబాద్ నుంచి రామవరం వెళ్లే సింగిల్ రోడ్డు పక్కనే ఈ స్థలం ఉంది. భవిష్యత్తులో డబుల్ రోడ్డుగా విస్తరిస్తే కార్యాలయ స్థలంలో కోత పడక తప్పదు. ముఖ్యంగా ఎల్లమ్మ చెరువుకు సమీప స్థలం కావడంతో ప్రమాదకరమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సమీకృత ప్రభుత్వ కార్యాలయ భవనాన్ని పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో నిర్మించడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, దీనిని కూడ పట్టణానికి దూరంగా నిర్మించాలనుకోవడమే కాకుండా చెరువు పక్కన ఉండటం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.



పక్కన ఉన్న ఎల్లమ్మ చెరువు

టపాసుల వ్యాపారులు నిబంధనలు పాటించాలి

● నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్


జగ్జీవన్, మున్సిపల్ కమిషనర్

నారాయణఖేడ్, అక్టోబరు27: దీపావళి పండుగ సందర్భంగా నారాయణఖేడ్ మున్సిపల్‌పరిధిలో టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారు నిబంధనలకు అనుగుణంగానడుచుకోవాలని మున్సిపల్ కమీషనర్‌జగ్జీవన్ కోరారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారు విధిగా అనుమతులు పొంది, నిబంధనలు పాటించాలన్నారు. జనవాసాలమధ్య దుకాణాలు ఏర్పాటు చేయరాదన్నారు. ప్రతి దుకాణం వద్ద 200 లీటర్ల డ్రమ్ములోనీటి నిల్వ ఉంచుకోవాలన్నారు. రెండు ఇసుక బస్తాలను సిద్ధంగాఉంచుకోవాలన్నారు. నిబంధనలు పాటించకుండా టపాకాయల దుకాణాలు ఏర్పాటుచేస్తే చట్టపరమైనచర్యలు తప్పవన్నారు.

భవనం నిర్మించారు.. యంత్రాలు మరిచారు..!

● రూ.2 కోట్లతో ఆధునిక దోభీఘాట్ పనులు అయ్యేదెప్పుడో..?

నర్సాపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం రెండుకోట్లతో చేపట్టిన పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ఆధునిక దోబీ ఘాట్ పనులు పూర్తయ్యేదెన్నడోనని స్థానిక రజకులు ఎదురుచూస్తున్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని చెరువు సమీపంలో దోబీఘాట్‌లో పాత పద్ధతిలో బట్టలు ఉతుకుతున్నారు. వారికి ఆ శ్రమ విముక్తి కల్పించి ఆధునిక వాషింగ్ మెషిన్లు ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఏడాది క్రితం ప్రస్తుత పాత దోబీఘాట్ సమీపంలోనే ఎకరా స్థలంలో రూ.2 కోట్లతో పనులు చేపట్టారు. కానీ భవనాన్ని అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. గతేడాది అక్టోబరులోనే ఈ ఆధునిక దోబీఘాట్‌కు శంకుస్థాపన చేయగా.. అందుకు సంబంధించిన పనులు సాగుతూ మొన్నటివరకు ప్రహరీ, భవనం పూర్తి చేశారు. కానీ భవనంలో ఆధునిక పెద్ద వాషింగ్‌మెషిన్లు ఏర్పాటు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రత్యేక నిధుల ద్వారా మంజూరైన ఈ ఆధునిక దోబీ ఘాట్.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో అందుకు కేటాయించిన నిధులు నిలిచిపోవడంతో యంత్రాల ఏర్పాటు చేయడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు చొరవ తీసుకుని నిలిచిపోయిన నిధులను తిరిగి వచ్చేలా చేసి రజకులకు ఎంతో ఉపయోగకరమైన ఈ ఆధునిక దోబీ ఘాట్‌ను వినియోగించుకునేలా చూడాలని కోరుతున్నారు. ఈ ఆధునిక దోబీఘాట్ పూర్తయితే ఇక్కడి రజకులకు పని ఎంతో సులువు అవుతుందన్నారు.


యంత్రాలు ఏర్పాటు చేయక నిరుపయోగంగా ఉన్న ఆధునిక దోభీఘాట్

సంజీవన్‌రావుపేట పీఏసీఎస్ సీఈవో సస్పెన్షన్

నారాయణఖేడ్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నిధుల దుర్వినియోగానికి సంబంధించి మండల పరిధిలోని సంజీవన్‌రావుపేట సీడెడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో మహేష్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ఆడిట్‌లో రూ.5 లక్షల 94 వేల 691 నిధులను దుర్వినియోగం చేసినట్లు బహిర్గతమైనట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయనున్నట్లు జిల్లా సహకార అధికారి తెలిపారు.

నవంబరు 2న ఉమ్మడి జిల్లా యోగా ఎంపికలు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నవంబరు 2వ తేదీన పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా యోగా సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సౌందర్య తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆదేశానుసారం మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాకు చెందిన అండర్-14, 17 విభాగంలో విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. నవంబరు 2న సిద్దిపేటలోని టీటీసీ భవన్‌లో జరిగే ఈ సెలక్షన్స్‌కు ఆసక్తిగల విద్యార్థులు ఒరిజినల్ బోనాఫైడ్‌తో హాజరుకావాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

మిరుదొడ్డి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మిరుదొడ్డి మాజీ సర్పంచ్ కిష్టయ్య అన్నారు. ఆదివారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడారు. గ్రామాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నారని పేర్కొన్నారు.

యువత పొగాకు దూరంగా ఉండండి

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


సంగారెడ్డిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే చింతాప్రభాకర్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : యువత పొగాకు దూరంగా ఉండాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్ కోరారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద పొగాకు నియంత్రణ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. పొగాకు వాడకంతో అనారోగ్య సమస్యలు వస్తాయని, పొగాకు రహిత సమాజం కోసం యువత ముందుకు రావాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పొగాకు నియంత్రణ సూపర్‌వైజర్ విష్ణువర్థన్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు


పోలీసులకు నిర్వహిస్తున్న వ్యాసరచన పోటీలు

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరువీరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ అక్టోబరు 21 నుంచి 31 వరకు ఫ్లాగ్‌డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులకు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సమాజంలో 'పోలీసు ప్రతిష్టను మెరుగుపరచడంలో నా పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. జిల్లాస్థాయిలో ఉత్తమంగా నిలిచిన మూడు వ్యాసాలు రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ తెలిపారు. అదేవిధంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు విచక్షణతో కూడిన ఫోన్ వాడకం, తెలంగాణను డ్రగ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అనే అంశాలపై రాసిన వ్యాసాల్లో ఉత్తమంగా నిలిచిన వ్యాసాలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

క్రైం కార్నర్

విష పురుగు కాటుతో యువకుడి మృతి


కిషన్(ఫైల్)

కుకునూరుపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విష పురుగు కాటుకు యువకుడు మృతి చెందాడు. కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామానికి చెందిన గట్టు కిషన్(27) పశువులకు మేత వేసేందుకు పొలం దగ్గరికి వెళ్లాడు. మేత వేస్తున్న క్రమంలో గుర్తు తెలియని విషపు పురుగు కాటు వేసింది. ఇంటికి వచ్చిన కిషన్ కాళ్లు మంటలు వస్తున్నాయని పడుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబసభ్యులు లేపగా..లేవకపోవడంతో అనుమానం వచ్చి సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. కాగా రెండేళ్ల క్రితం మృతుడి తండ్రి మృతిచెందగా.. తల్లి కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటున్న కిషన్ మృతితో ఆ కుటుంబం అనాథగా మారింది. మృతుడికి భార్య కవిత, కుమారుడు వర్షిత్(7), కూతురు నక్షత్ర(5) ఉన్నారు. కిషన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

మార్కులు తక్కువ వస్తాయని విద్యార్థి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న వరుణ్‌తేజ్

కౌడిపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో మార్కులు తక్కువగా వస్తే తండ్రి కొడతాడన్న భయంతో విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కౌడిపల్లి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వరుణ్‌తేజ్ కౌడిపల్లిలోని తెలంగాణ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ మధ్య నిర్వహించిన ఎస్ఏ పరీక్షలో మార్కులు తక్కువగా వస్తే తన తండ్రి కొడతాడనే భయంతో శనివారం రాత్రి 7.30 గంటలకు స్టడీ అవర్‌లో స్నేహితుల ముందే ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని స్నేహితులు వెంటనే ఉపాధ్యాయులకు తెలిపారు. వారు వెంటనే మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించి, కుటుంబసభ్యులకు సమాచారమందించారు. ప్రస్తుతం విద్యార్థి పరిస్థితి నిలకడగానే ఉన్నది.

దాడికి పాల్పడిన 8 మందికి రిమాండ్

మద్దూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల పెద్దమనుషుల సమక్షంలో చోటుచేసుకున్న పంచాయతీని మనసులో పెట్టుకుని ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇరువురిపై కర్రలు, రాడ్లతో దాడికి పాల్పడిన 8 మందిపై కేసు నమోదైంది. ఈ సంఘటన మద్దూరు మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా హుస్నాబాద్ ఏసీపీ సతీష్ ఆధ్వర్యంలో చేర్యాల సీఐ శ్రీను, హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, చేర్యాల ఎస్ఐ నీరేష్, కొమురవెల్లి ఎస్ఐ రాజు, అక్కన్నపేట ఎస్ఐ విజయ్‌భాస్కర్‌తో పాటు స్పెషల్‌పార్టీ పోలీసులు ఆదివారం పికెటింగ్ నిర్వహించారు. ఈ విషయమై ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్దూరు గ్రామానికి చెందిన చిలుక సతీష్ తన స్నేహితుడు దామెర విజయ్‌తో రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఊర్లోంచి కాలనీకి వస్తున్నాడు. ఆ సమయంలో వాటర్ ప్లాంట్ సమీపంలో సుమారు 8 మంది అడ్డుకుని కర్రలు, రాడ్లతో కొట్టగా.. ఇరువురి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. దాడిచేసిన చిలుక లచ్చయ్య, చిలుక రాజు, చిలుక రాంబాబు, చిలుక పరశురాములు, చిలుక బాబు, చిలుక మురళి, చిలుక ప్రేమ్‌కుమార్, చిలుక మురళి తన కుమారుడు చిలుక సతీష్‌ను చంపేందుకు ప్రయత్నించరంటూ తండ్రి చిలుక దశరథం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని 8 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

నేడు మంత్రి దామోదర్ రాక

రేగోడు అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం రేగోడు మండలంలో పర్యటించినట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దిగంబరరావు తెలిపారు. బోరంచ ఎత్తిపోతల పథకం అదనపు పనుల నిర్మాణం, రేగోడు చౌదరిపల్లి, కొత్వాల్‌పల్లి, పెద్ద శంకరంపేట మండలంలోని బద్దారం, బుజరంపల్లి తదితర చెరువులకు సింగూర్ జలాలను నింపుటకు పైప్‌లైన్ నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం టి లింగంపల్లిలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతారని తెలిపారు.



పటాన్‌చెరులోని ఇండస్ట్రియల్ పార్కు ఏరియా

పరిశ్రమల మనుగడ ప్రశ్నార్థకం..

- కార్మికుల కొరతతో చతికిల
- ఆర్డర్లున్నా అందించలేని వైనం
- ఉత్తరాది రాష్ట్రాల నుంచి కార్మికుల దిగుమతి
- 50 శాతం ఉత్పత్తితో నెట్టుకొస్తున్న యాజమాన్యాలు

పటాన్‌చెరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధిరంగంలో సింహ భాగం చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమలే కీలక పాత్ర పోషిస్తున్నాయి. వీటికి స్వర్గధామంలా విలసిల్లే సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పారిశ్రామికవాడ ప్రస్తుతం అంపశయ్యపై కొట్టుమిట్టాడుతోంది. గతంలో కరెంటు సమస్యలు, తరువాత జీఎస్టీ, వెంటనే కొవిడ్ ఇలా ఎప్పుడూ ఏదో ఒక సంక్షోభంతో పరిశ్రమలు చతికిపోతున్నాయి. మహారత్న హోదా ఉన్న బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఓడీఎఫ్ తదితర భారీ పరిశ్రమల నుంచి వచ్చే వందల కోట్ల ఆర్డర్లతో పాటు వేలాదిమంది కార్మికులతో కళకళలాడే పారిశ్రామికవాడలో నేడు నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. కేవలం ఒక్క బీహెచ్ఈఎల్‌కు అనుబంధంగా 1,500 పరిశ్రమలు ఉంటే నేడు వందలోపునకు పడిపోవడం దుస్థితికి అద్దం పడుతోంది. ఇప్పుడే సమస్యల నుంచి బయటపడి పరిశ్రమల నుంచి ఆర్డర్లు వస్తున్నా నైపుణ్యం లేని కార్మికుల కొరతతో చిన్న పారిశ్రామికవేత్తలు చతికిలపడిపోతున్నారు.

పరిశ్రమల్లో పనికి మొగ్గుచూపని యువత

పరిశ్రమల్లో పనిచేసేందుకు యువత ముందుకు రావడం లేదు. పెరిగిన జీవన వ్యయం, ఆ స్థాయిలో ఫ్యాక్టరీల్లో అందని జీతాల వల్ల ఉపాధి కోసం పారిశ్రామికవాడ వైపు వచ్చేవారి సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. చిన్న పరిశ్రమలు పెద్ద సంఖ్యలో ఉన్న పటాన్‌చెరు, పాశమైలారం, ఐడీఏ బొల్లారం, అశోక్‌నగర్ తదితర పారిశ్రామికవాడల్లో పరిశ్రమల గేట్లకు 'కార్మికులు కావలెను' అనే బోర్డులు వేలాడుతున్నాయి. ఒకప్పుడు తెలంగాణ నలుమూలలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి జిల్లా నుంచి కార్మికులు ఉపాధి కోసం పటాన్‌చెరు పారిశ్రామికవాడకు తరలివచ్చేవారు. ప్రస్తుత యువత, నైపుణ్యం ఉన్న కార్మికులు పరిశ్రమల్లో పనిచేసేందుకు రావడం లేదు. దీంతో యజమానులు ఛత్తీస్‌ఘడ్, యూపీ, బీహార్, ఒరిస్సా నుంచి కార్మికులను ముందస్తు ఒప్పందాలతో రప్పించుకుంటున్నారు. అందుకు ప్రత్యేక ఏజెన్సీలు పనిచేస్తున్నాయి. ఒకవైపు ఆర్డర్లు వస్తున్నా చిన్నపరిశ్రమల్లో కార్మికుల కొరతతో సకాలంలో ఉత్పత్తులను అందించలేక పరిశ్రమలను మూసివేసుకునే పరిస్థితి ఏర్పడింది. పటాన్‌చెరు పారిశ్రామికవాడలో చిన్న తరహా పరిశ్రమలు కేవలం 50 శాతం కార్మికులతో ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. ఇంజనీరింగ్, ప్లాస్టిక్, అల్లాయిస్ పరిశ్రమల్లో పనిచేసే స్కిల్డ్, అన్‌స్కిల్డ్ కార్మికుల బీహార్, ఛత్తీస్‌ఘడ్, ఉత్తర్‌ప్రదేశ్, బెంగాల్, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. స్థానిక యువకులు ఎవరూ పరిశ్రమల్లో పనిచేసేందుకు ముందుకు రావడం లేదు. పరిశ్రమల్లో పరిస్థితిని గమనించిన ఆయా పారిశ్రామికవాడల్లోని టీఎస్ ఐఐసీ సర్వీస్ సొసైటీలు రంగంలోకి దిగాయి. ఏకంగా వాట్సాప్ నెంబర్లు ఇచ్చి ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నా స్పందన కనిపించడం లేదు. పారిశ్రామికవాడల్లో ప్రస్తుతం వేల సంఖ్యలో ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయని పేర్కొంటున్నారు. బీటెక్ మెకానికల్, కంప్యూటర్, పాలిటెక్నిక్, ఐటీఐ నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించే అవకాశాలున్నాయి. వాటితోపాటు సీఎన్‌సీ మిషన్లను నడిపేందుకు ప్రోగ్రాం ఆపరేటర్లు, ఇంటర్, ఎస్ఎస్‌సీ, మొదలుకొని బీఎస్‌సీ, బీఏ, బీకాం విద్యార్థులకు సైతం ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. జిల్లా పరిశ్రమలశాఖ, ఉపాధి కేంద్రాల ద్వారా ఉద్యోగాలకు పిలుపు ఇచ్చినా స్పందన కరువైంది. సాధారణ వేతనాలకంటే ఎక్కువగా ఇస్తామని చెబుతున్నా యువత ముందుకు రాని దుస్థితి ఏర్పడింది.

స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలను విస్తరించాలి



సమస్యల్లో ఉన్న చిన్నపరిశ్రమలను ఆదుకునేందుకు గత ప్రభుత్వాలు ప్రకటించిన సబ్సిడీలను ఇంతవరకూ చెల్లించలేదు. పాత పరిశ్రమలను ఆదుకోనంతవరకు కొత్త పరిశ్రమలకు సబ్సిడీలను ప్రకటించినా లాభం లేదు. పరిశ్రమలు పెట్టేందుకు వచ్చే ఔత్సాహికులను మంచి వేదికను ప్రభుత్వమే ఏర్పాటుచేయాలి. ప్రస్తుతం ఆర్డర్లు ఆశాజనకంగా వస్తున్నా కార్మికుల కొరత తీవ్రంగా ఉంది. స్థానిక యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కింద శిక్షణ ఇప్పించాలి. ఐటీఐలను పారిశ్రామికవాడలకు అనుబంధంగా ఏర్పాటు చేయాలి. ఉపాధి కల్పనలో కీలకపాత్ర పోషిస్తున్న చిన్న, సూక్ష్మ పరిశ్రమలను కాపాడుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది.

-గోకుల్‌శ్రీధర్, బీహెచ్ఈఎల్ ఆన్సలరీ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు

ప్రత్యామ్నాయాల వైపు యువత చూపు

గ్రామాల్లో నీటి వసతి పెరగడం, వ్యవసాయ అనుబంధ రంగాలు ఊపందుకోవడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల భూముల ధరలు పెరగడంతో యువత రూ.20 వేల లోపు జీతం ఇచ్చే చిన్న పరిశ్రమల్లో పనిచేయడం లేదు. పట్టణాల్లో మాల్స్‌లో పనిచేసే యువత సంఖ్య పెరిగింది. స్విగ్గీ, జోమాటో తదితర ఆన్‌లైన్ సేవలందిస్తూ ఆడుతూ పాడుతూ సంపాదించేందుకు మొగ్గుచూపుతున్నారు. ఓలా, ఊబర్ క్యాబ్‌లు నడుపుతూ ప్రత్యామ్నాయ ఉపాధి రంగాల వైపు చూస్తున్నారు. ఇక బీటెక్‌లో ఐటీ, సీఎస్‌సీ, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో పట్టాలు పొందిన యువత సాఫ్ట్‌వేర్ వైపు వెళ్తున్నారు. దీంతో ఉత్తరాది రాష్ట్రాల నుంచి తక్కువ వేతనాలకు పనిచేసే వారిని కాంట్రాక్టు పద్ధతుల్లో తెచ్చి తాత్కాలిక షెడ్డు వేసి ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు.



పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో కార్మికులు కావాలని పరిశ్రమలు ఎదుట ఏర్పాటు చేసిన బోర్డు

గడువు పదిరోజులే...

5వ పేజీ తరువాయి

ఏర్పాటు చేసినా అంతంతమాత్రంగానే వస్తున్నారు.

ప్లీజ్.. ఫారం నింపండి అంటూ..

ప్రస్తుతం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ రేసులో 10 మంది దాకా ఆశావహులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గ్రాడ్యుయేట్ల ఓట్లతోనే వీరి గెలుపోటములు ఆధారపడి ఉన్నందున తమ ఆధ్వర్యంలోనే ఓట్లు నమోదైతే తమకు విశ్వాసం ఉంటుందని అనుకుంటున్నారు. అందుకే పట్టభద్రుల్లో చైతన్యం తెచ్చేలా ఫ్లెక్సీలు కడుతున్నారు. సోషల్ మీడియా, వాట్సాప్, ఫేస్‌బుక్‌ల ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరుతున్నారు. గ్రాడ్యుయేట్ పూర్తిచేసి అర్హత ఉన్నవారి ఫోన్‌నంబర్లు తీసుకొని ఎన్‌రోల్‌మెంట్ పూర్తిచేయాలని అడుగుతున్నారు. నియోజకవర్గం, జిల్లా కేంద్రాల్లో ప్రత్యేకంగా కార్యాలయాలు తెరిచి ఫారం-18లను పంపిణీ చేస్తున్నారు. కొందరైతే ఇంకో అడుగు ముందుకేసి పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఫారం నింపాలని వేడుకుంటున్నారు. పట్టభద్రుల డిగ్రీ, ఆధార్, ఓటరు ఐడీ జిరాక్స్ పత్రాలు సేకరిస్తూ ఫారంలపై వారి సంతకాలు తీసుకొని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఆశావహులే అప్లయ్ చేస్తున్న పరిస్థితి నెలకొంది. గడువు సమీపిస్తుండడంతో హడావిడి ఎక్కువైంది.

పెరగనున్న ఉపాధ్యాయుల ఓట్లు..

కరీంనగర్- మెదక్- ఆదిలాబాద్- నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి 2019లో సుమారు 21వేల ఓట్లు ఉన్నాయి. అయితే ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. 1-11-2018 నుండి 31-10-2024 వరకు హైస్కూళ్లు, ఆపైన ప్రభుత్వ విద్యాసంస్థల్లో 3 సంవత్సరాలపై బోధన చేస్తున్న ఉపాధ్యాయులు ఓటు హక్కుకు అర్హులు. హైస్కూళ్లు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, గురుకులాలు, మాడల్, కస్తూరిబా పాఠశాలలు, ప్రభుత్వ ఇంజనీరింగ్, మెడికల్, ఇతర ఉన్నత విద్యాసంస్థల్లో పనిచేసే అర్హులైన వారందరికీ ఓటు హక్కు పొందే అవకాశం ఉంది. ఇక విద్యాశాఖ నిబంధనల ప్రకారం వేతనాలు పొందే ప్రైవేట్ విద్యాసంస్థల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు కూడా అర్హత పొందవచ్చు. గడిచిన ఆరేళ్ల వ్యవధిలో ప్రభుత్వ విద్యాసంస్థలు పెద్ద సంఖ్యలో నెలకొల్పబడ్డాయి. ఉపాధ్యాయులు, అధ్యాపకులూ రిక్రూట్ అయ్యారు. అందుకే ఉపాధ్యాయ ఓటర్ల సంఖ్య 50వేల మార్కును చేరుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఏదేమైనప్పటికీ గతం కంటే భిన్నంగా ఓటర్ల నమోదుపై ఆశావహులు దృష్టి పెట్టారు. ఎన్నికల నిర్వహణకు మరో ఐదు నెలల సమయం ఉన్నప్పటికీ ప్రచారంలో వెనక్కు తగ్గడం లేదు. ఫలితంగా రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలు రసవత్తరంగా ఉంటాయనే సంకేతాలు కనిపిస్తున్నాయి.


గుమ్మడిదల, అన్నారం గ్రామాల సమీపంలో మెదక్-హైదరాబాద్ రోడ్డుపై జీవాలను తరలిస్తున్న గొర్రెల కాపరులు

మేతకు.. మెతుకుసీమకు..

- మహబూబ్‌నగర్ నుంచి వేల సంఖ్యలో జీవాల వలసలు

గుమ్మడిదల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కోసం ప్రజలు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వలసలు పోవడం సహజం. అయితే మేత కోసం మూగజీవాలు కూడా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వలస పోకతప్పడం లేదు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట ప్రాంతంలో జీవాలకు మేత లేకపోవడంతో మెతుకు సీమగా పేరుగాంచిన మెదక్ జిల్లాకు వేల సంఖ్యలో జీవాలను తరలిస్తున్నారు. జీవాలను తరలించడంలో గొర్రెలకాపరులు పడుతున్న కష్టాలు వర్ణణాతీతం. వందల కిలోమీటర్లు ఉన్న నారాయణపేట మండలం నుంచి మెదక్ జిల్లాకు కాలినడకన వెళ్తే వారంరోజులు పడుతుందని చెబుతున్నారు. ఉదయం సద్ది సంకనేసుకుని బయలుదేరి గొర్రెలను మేపుకుంటే కిలోమీటర్లు వెళ్తామంటున్నారు. రాత్రి అయితే ఎక్కడపడితే అక్కడ బస చేస్తారు. ప్రధాన రహదారిపై గొర్రెలను తరలించాలంటే ఎన్నో కష్టాలు పడాల్సి వస్తుంది. రోడ్డుపై వాహనాలు రాకపోకలు సాగించడంతో జీవాలు బెదిరిపోతున్నాయి. ఎండకు, వానకు తట్టుకుని జీవాలను పోషించి, అమ్మినప్పుడు వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషించాల్సిందేనని అంటున్నారు. రెండునెలలు మెదక్ జిల్లాలో, ఆ తర్వాత ఖమ్మం నుంచి తిరిగి సొంతూరికి వెళ్తామని వారు చెబుతున్నారు.

వేతన ఒప్పందం అభినందనీయం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



బొంతపల్లి పారిశ్రామికవాడలో జరిగిన వేతన ఒప్పంద అభినందన సభలో మాట్లాడుతున్న చుక్క రాములు

గుమ్మడిదల/గజ్వేల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బొంతపల్లి పారిశ్రామికవాడలోని న్యూ లాండ్ పరిశ్రమ కార్మికులకు చరిత్రాత్మక వేతన ఒప్పందం చేయడం అభినందనీయమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. ఆదివారం న్యూల్ లాండ్ పరిశ్రమ కార్మికులు ఏర్పాటు చేసిన వేతన ఒప్పంద అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పరిశ్రమలో వేతనం ఒప్పందం కార్మికుల ఐక్యతతో చేశారన్నారు. రూ.14 వేల వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు వేతన ఒప్పందంలో సాధించామని పేర్కొన్నారు. కార్మికులకు నిత్యం సీఐటీయూ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీ.మల్లేష్, రాష్ట్ర కమిటీ సభ్యుడు కే.రాజయ్య, యూనియన్ జనరల్ సెక్రటరీ వెంకటేష్, నాయకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ప్రజా ఉద్యమాల్లో సీపీఎం పాత్ర కీలకమని ఆ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన ఆహ్వాన సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎర్రజెండా దేశవ్యాప్తంగా భూఉద్యమాలు, రైతాంగ, కార్మిక పోరాటాల నిర్వహించిందని తెలిపారు. డిసెంబరు 1, 2 తేదీల్లో గజ్వేల్ పట్టణంలో సీపీఎం జిల్లా మూడో మహాసభలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య, గోపాలస్వామి, శశిధర్, భాస్కర్, సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు, సీపీఎం గజ్వేల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ విస్మరించడంపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తా: ఎమ్మెల్యే

నర్సాపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన మెదక్‌లో ఈ మధ్య ప్రారంభించిన మెడికల్ కాలేజీకి ఉమ్మడి జిల్లాలోనే సీనియర్ ఎమ్మెల్యేగా ఉన్న తనను ఆహ్వానించకుండా ప్రొటోకాల్ విస్మరించారని, ఈ విషయమై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సీఎం కేసీఆర్ మెదక్‌లో వంద సీట్ల మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారని, దానిని కుదించి 50 సీట్లకు చేసి ఈనెల 24న మంత్రులు కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహాలు ప్రారంభించారన్నారు. ఈ ప్రారంభోత్సవానికి మెదక్ జిల్లాలో ఉన్న రెండు నియోజకవర్గాల్లో ఒకటైన నర్సాపూర్ ఎమ్మెల్యేగా ఉన్న తనను అధికారులు ఆహ్వానించకుండా అవమానించారన్నారు. అదే అధికార కాంగ్రెస్‌కు చెందిన ఏ హోదా లేని నాయకులను మాత్రం వేదికపై కూర్చోబెట్టి మర్యాదలు చేశారన్నారు. అలాగే హత్నూర మండలం దౌల్తాబాద్‌లో పీహెచ్‌సీ ప్రారంభోత్సవంలో కూడా ప్రొటోకాల్ విస్మరించారన్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘన విషయమై త్వరలోనే స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. అదేవిధంగా అసెంబ్లీ సమావేశాల్లో తనకు జరుగుతున్న అగౌరవాన్ని ప్రస్తావిస్తానని పేర్కొన్నారు.

రూ.3.60 లక్షల గంజాయి మొక్కలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలను చూపుతున్న ఎక్సైజ్ శాఖ పోలీసులు

వట్‌పల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్న సంఘటన సంగారెడ్డి జిల్లా పరిధిలోని నీర్జప్ల గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. ఎక్సైజ్ సీఐ సాగర్ రెడ్డి, ఎస్ఐ విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి చంద్రయ్య పత్తి చేనులో 28, పెద్దగొల్ల మొగులయ్య పత్తి చేనులో 8 గంజాయి మొక్కలు సాగుచేస్తున్నారని తెలిసి స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.3.60 లక్షలు ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం నిందితులు పరారీలో ఉన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ సందీప్, కానిస్టేబుల్స్ విక్రమ్, సాయిలు, చౌదరి, ముఖి పంచాయతీ కార్యదర్శులు బీరప్ప, జయంతి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

'తుఫాన్' బోల్తా, 11 మందికి గాయాలు

- ఇద్దరి పరిస్థితి విషమం

కల్హేర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవునిపల్లి, బాచేపల్లి గ్రామాల మధ్య 161 జాతీయ రహదారిపై ఆదివారం తుఫాన్ బోల్తాపడిన సంఘటనలో 11 మందికి గాయాలు కాగా.. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నది. మహారాష్ట్రలోని దెగ్లూర్‌తో పాటు కామారెడ్డి జిల్లా బిచ్కుంద, పిట్లం మండల కేంద్రాల నుంచి 18 మంది ప్రయాణికులతో హైదరాబాద్ వెళ్తున్న (ఏపీ 23 ఎక్స్ 7451) నంబరు గల తుఫాన్ వాహనం వేగంగా వెళ్తూ.. 161వ జాతీయ రహదారిపై బోల్తాపడింది. ఈ ఘటనలో 11 మందికి గాయాలు కాగా.. ఇందులో వడగామకు చెందిన దీపాళి(12), దెగ్లూర్ బరాళికి చెందిన బరాళిస్వాయి(9) అనే బాలికల పరిస్థితి విషమంగా ఉన్నది. గాయాలపాలైన బాలికల తల్లిదండ్రులను సంగారెడ్డి ఆస్పత్రికి, మిగిలిన ఏడుగురిని నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. డ్రైవర్ అతివేగంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం సంభవించిందని తెలిపారు.

ఆటో బోల్తాపడి ఐదుగురికి...


ఆటో ప్రమాదంలో గాయపడ్డ కూలీలు

చేర్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆటోడ్రైవర్ నిర్లక్ష్యం ఐదుగురిని గాయాలపాలు చేసింది. గేర్‌లో ఉండగానే ఆటోను స్టార్ట్ చేయడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో పలువురికి గాయాలవగా.. మరికొందరికి ప్రాణాపాయం తప్పింది. బాధితుల వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వేచరేణి గ్రామానికి చెందిన మాదాసు ఎల్లవ్వ, మాదాసు పోశవ్వ, మాదాసు అండవ్వ, లక్ష్మి, రాణి, శాంతమ్మ, మాదాసు లక్ష్మి, తాడూరి రేణుక, మాదాసు ప్రేమలత తదితరులు ఆదివారం కొమురవెల్లి మండలం లెనిన్‌నగర్ గ్రామంలో కూలీ పనులకు వెళ్లారు. పనులు ముగించుకున్న తరువాత సాయంత్రం ఇంటికి వెళ్లేందుకు అందరూ ఆటోలో కూర్చున్నారు. కానీ డ్రైవర్ ఆటో గేర్‌లో ఉన్న విషయాన్ని గుర్తించకుండా వెనక తాడు లాగి స్టార్ట్ చేయడంతో ఒక్కసారిగా అదుపుతప్పి దూసుకెళ్లింది. అప్రమత్తమైన పలువురు ఆటోలోంచి దూకగా.. మరికొందరు ఆటోలోనే ఉండిపోయారు. కొద్దిదూరం వరకు వెళ్లిన ఆటో బోల్తాపడింది. దీంతో మాదాసు పోశవ్వ, ఎల్లవ్వ, రాణి, అండాలు, లక్ష్మిలకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని హుటాహుటిన చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బలంగా గాయాలైనవారిని మెరుగైన వైద్యం కోసం సిద్దిపేటకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



గాయపడ్డ స్వప్న, సహర్ష్

చేర్యాల మండలం ముస్త్యాల గ్రామశివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయాలపాలయ్యారు. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీకాంత్, తన భార్య స్వప్న, కుమారుడు సహర్ష్‌తో కలిసి కారులో సిద్దిపేటలో జరిగే శుభకార్యానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలోని ముస్త్యాల శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో మద్యం దుకాణం దగ్ధం

జహీరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మొగుడంపల్లిలో గల రేణుకా ఎల్లమ్మ మద్యం దుకాణంలో ఆదివారం ఉదయం 7 గంటలకు విద్యుదాఘాతం ఏర్పడి షాపు దగ్ధమైంది. దుకాణం నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు నిర్వాహకులకు ఫోన్‌చేసి సమాచారమందించారు. వారు అగ్నిమాపకశాఖకు తెలపగా.. వారు వచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా.. అప్పటికే దుకాణం మొత్తం దగ్ధమైంది. దుకాణంలో రూ.1 కోటి విలువ చేసే మద్యం దగ్ధమైనట్లు యజమానులు తెలిపారు.

నేటి నుంచి
డిగ్రీ సెకండ్ సెమిస్టర్ పరీక్షలు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ పరిధిలోని డిగ్రీ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. 2023- 24 విద్యా సంవత్సరానికి గానూ పరీక్ష ఫీజు చెల్లించిన విద్యార్థులు నేటి నుంచి నవంబరు 4వ తేది వరకు జరిగే పరీక్షలకు హాజరు కావాలని సిద్దిపేట అంబేడ్కర్ స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ శ్రద్ధానందం తెలిపారు. పరీక్షాకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు కళాశాల ఐడెంటిటీ కార్డు లేదా ఆధార్ కార్డును వెంట తీసుకరావాలని సూచించారు.

ఎమ్మెల్యే పరామర్శ

చేర్యాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణానికి చెందిన మాజీ వార్డుసభ్యురాలు, బీఆర్ఎస్ నాయకురాలు బుడిగె విజయ (51) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆమె మృతిపై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేస్తూ ఫోన్‌లో మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, కౌన్సిలర్లు మంగోలు చంటి, మాజీ ఉపసర్పంచు మంచాల కొండయ్య, పుర్మ వెంకట్‌రెడ్డి, బూరగోని తిరుపతి, ముస్త్యాల బాలనర్సయ్య, శివ గారి అంజయ్య తదితరులు ఆమె మృతదేహానికి నివాళులర్పించారు.

బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేనా?

- బస్టాండ్ ఎదురుగా వివిధ పార్టీల గద్దెలు
- బస్సుల ప్రవేశానికి అంతరాయం
- లక్షలు వెచ్చించినా ప్రయోజనం శూన్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



బస్టాండ్ ఎదురుగా వివిధ పార్టీల జెండా గద్దెలు

కుకునూరుపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్ నిరుపయోగంగా మారింది. పిచ్చిమొక్కలతో చిన్నపాటి అడవిని తలపిస్తున్నది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని దుస్థితి ఇది. కొత్త మండలం ఏర్పడిన తర్వాతనైనా బస్టాండ్ మెరుగుపడుతుందనుకున్న ప్రయాణికుల ఆశ నిరాశగానే మిగిలింది.

బస్సులు రావు..

టీడీపీ ప్రభుత్వం హయాంలో 2000ల సంవత్సరంలో ముత్యంరెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో బస్టాండ్ కోసం స్థలం కొనుగోలు చేసి నిర్మాణం కోసం రూ. 20-25 లక్షలు వరకు వెచ్చించారు. సాధారణంగా బస్టాండ్‌లోకి బస్సులు వచ్చి ప్రయాణికులను దించడం, ఎక్కించుకోవడం మనకి తెలిసిందే. కానీ కుకునూరుపల్లి బస్టాండ్ దానికి పూర్తిగా విరుద్ధం. బస్టాండ్ లోపలికి అసలు బస్సులు రానేరావు. రాజీవ్ రహదారిపైనే ఆగి వెళ్తా ఉంటాయి. అది కూడా ప్రయాణికులు ఉంటేనే ఆ మాత్రం బస్సులు రోడ్డుపై ఆగుతాయి. ఈ మాత్రానికి బస్టాండ్‌ని లక్షలు వెచ్చించి నిర్మించడం ఎందుకని ప్రయాణికులు, గ్రామస్థులు వాపోతున్నారు.

వసతులూ అంతంతే..

వసతుల విషయానికి వస్తే విద్యుత్ సౌకర్యం ఉన్నప్పటికీ బస్టాండ్‌లో ఒక్క లైట్ కూడా లేదు. దీంతో రాత్రి సమయంలో ఇక్కడా బస్టాండ్ ఉందా? అనే సందేహం ప్రయాణికులకు కలుగుతున్నది. బస్టాండ్‌లో మరుగుదొడ్లు, మూత్రశాలల గదులకు తాళాలు వేసి ఉండడం గమనార్హం.

పిచ్చిమొక్కలు.. చెత్తాచెదారం

పిచ్చిమొక్కలతో, చెత్తాచెదారంతో నిండి చెత్తకుప్పను తలపిస్తున్నది. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి చిన్నపాటి అడవిని తలపిస్తున్నది. దీంతో కొందరు రాత్రి వేళల్లో మద్యం సేవిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఆటంకంగా పార్టీల జెండా గద్దెలు

వివిధ రాజకీయ పార్టీల జెండా గద్దెలు బస్టాండ్ ఎదుట నిర్మించడంతో బస్సులు రావడానికి ఇబ్బందిగా మారింది. వాటిని తొలగించాలని పోలీసు వారికి చెప్పాం. విద్యుత్ బకాయలు రూ. 70000 వేలు ఉండడంతో గతంలో విద్యుత్‌శాఖ వారు కనెక్షన్ తొలగించారు. రూ. 10వేలు చెల్లించి మరోమారు విద్యుత్ కనెక్షన్ తీసుకున్నాం. విద్యుత్ దీపాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాం. అవి రాగానే ఏర్పాటు చేస్తాం, మరుగుదొడ్లు, మూత్రశాల వినియోగంలోనే ఉన్నాయి.

పవన్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్

ఉద్యోగులను మభ్యపెడుతున్న ప్రభుత్వం

- తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనాకర్‌రెడ్డి

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపి ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవటం దారుణమని తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్‌రెడ్డి విమర్శించారు. సిద్దిపేట పట్టణంలోని శిశుమందిర్‌లో ఆదివారం జిల్లా అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన తపస్ జిల్లా కార్యవర్గ సమావేశం న్విహించారు. ఈ సమావేశానికి హాజరైన శ్రీనాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చేటప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గుర్తుకు రాలేదు అని ప్రశ్నించారు. 317 జీవో వల్ల ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల సమస్యలకు వెంటనే పరిష్కారం చూపించాలని, లేదంటే నిరసనలు చేపడతామని హెచ్చరించారు. అందులో భాగాంగ అన్ని మండల తహసీల్దార్ కార్యాలయల్లో నేడు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో తపస్ జిల్లా కార్యదర్శి పరుశురాములు, నాయకులు దేవదాసు, బుచ్చిరెడ్డి, జైపాల్‌యాదవ్, వెంకటరామిరెడ్డి, విద్యాసాగర్, రమేష్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలో సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ ప్రాంతీయ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని, అధికారంలోకి రాగానే బదిలీలు, పదోన్నతులు పూర్తి చేసిందన్నారు. డీఎస్సీ ద్వారా 11వేల ఉపాధ్యాయులను నియామకం చేసిందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, నాయకులు భిక్షపతి, యూనియన్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, మంజులరెడ్డి, సంధ్య, సంగీత, మోహినుద్దీన్, సురేష్, నరసింహా, నరేష్, నాగరాజు, కరుణాకర్, సంతోష్ గోపాల్, నాగరాజు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకపోవడం దుర్మార్గం

- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సుమారు 6 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం వారి రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను చెల్లించలేదని, మూడేళ్ల తర్వాత చెల్లిస్తామని చెప్పడం దుర్మార్గమని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన మన్మోహన్ వీడ్కోలు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేసిన చివరి రోజుననే రిటైర్మెంట్ డబ్బులు వాళ్ల చేతికొచ్చేవని, కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు 15 డీఏలు ఇచ్చామని, ప్రస్తుతం రెండు డీఏలు వస్తాయనుకున్న ఉద్యోగులకు ఒక్క డీఏ ఇచ్చి ప్రభుత్వం నిరాశ పరిచిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- సిద్దిపేట టౌన్: సిద్దిపేట పట్టణంలోని భారత్‌నగర్‌కు చెందిన విద్యార్థిని లిఖిత ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షలో ప్రతిభ కనబరిచి మెడిసిన్‌లో సీటు సాధించింది. ఈ మేరకు ఆదివారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు లిఖితను అభినందించి శాలువాతో సత్కరించారు. విద్యార్థిని తల్లిదండ్రులు రాజు, రేణుక కులవృత్తిని చేసుకుని కుటుంబాన్ని సాగిస్తున్నారు. ఈ మేరకు లిఖిత నీట్ పరీక్షలో మంచి ర్యాంక్ సాధించి వరంగల్ జిల్లాలోని ఓ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. సిద్దిపేట జిల్లాలోని విద్యార్థినీ, విద్యార్థులు లిఖితను స్ఫూర్తిగా తీసుకుని చదువులో రాణించాలని హరీశ్‌రావు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, నాయకులు భుంపల్లి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట టౌన్: లిఖితకు శాలువా కప్పి అభినందిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా టీపీసీసీ అధికార ప్రతినిధి రాజిరెడ్డి



నియామకపత్రం అందుకుంటున్న మొగుళ్ల రాజిరెడ్డి

చేర్యాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం వీరన్నపేటకు చెందిన మొగుళ్ల రాజిరెడ్డి ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నియామకమయ్యారు. ఈమేరకు యూనియన్ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి చేతులమీదుగా ఆదివారం నియామకపత్రం అందుకున్నాడు. మొగుళ్ల రాజిరెడ్డి టీపీసీసీ అధికార ప్రతినిధిగా, హైదరాబాద్ వాటర్ వర్క్స్ అండ్ సేవరేజ్ కంగార్ యూనియన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న క్రమంలో ఆయనకు ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి వరించింది.

పద్మశాలి యువజనసంఘం అధ్యక్షుడిగా..

దుబ్బాక, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక పట్టణంలోని పద్మశాలి యువజనసంఘం నూతన కార్యవర్గాన్ని పద్మశాలి సమాజ అధ్యక్షుడు జిందం గాలయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యువజన సంఘం అధ్యక్షుడిగా చేగూరి నరేష్, ఉపాధ్యక్షుడిగా కూరపాటి ఆనంద్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా రాపెల్లి రాజు, సంయుక్త కార్యదర్శిగా భాను, కోశాధికారిగా చిలుక శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. తమపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు తదితరులున్నారు.

రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడిగా..



తలకొక్కుల రాజు

గజ్వేల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడిగా గజ్వేల్ పట్టణానికి చెందిన హైకోర్టు న్యాయవాది తలకొక్కుల రాజు ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో తలకొక్కుల రాజు అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా శివకుమార్

గజ్వేల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా గజ్వేల్ పట్టణానికి చెందిన కుంటనోళ్ల శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఎన్నికల్లో సిద్దిపేట జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివకుమార్‌కు రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కిందని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్ తెలిపారు.

హిందూ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

కుకునూరుపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంపై జరిగిన దాడికి నిరసనగా ఆదివారం కుకునూరుపల్లి మండల కేంద్రంలో భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్, బీజేపీ అనుబంధ సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని రామాలయం నుంచి పెద్దమ్మతల్లి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందూ ఆలయాలపై, హిందువులపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కనకయ్య, ఉప్పల రాజు, దాసరి స్వామి, సదానందం, అంజనేయులు, రామ్‌రెడ్డి, నందకిషోర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన



రక్తదాతలకు ప్రశంసాపత్రం అందిస్తున్న ప్రతినిధులు

చేర్యాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివేకానంద టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా యువకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు అధికసంఖ్యలో రక్తదానం చేశారు. అనంతరం అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మీస వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బాల భాస్కర్, నితీశ్, అమరేందర్‌రెడ్డి, సిద్ధారెడ్డితో పాటు స్థానికులు జంబుల రజనీకర్‌రెడ్డి, పరమేశ్వర్, నరిగే శ్రీనివాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించాలి

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్



మల్లన్నసాగర్ పునరావాస కాలనీలో మాట్లాడుతున్న శంకర్

గజ్వేల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించాలని, పరిహారం చెల్లించాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ పునరావాస కాలనీని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1636 కుటుంబాలకు పైగా ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ నేటికి హద్దులు చూపలేదన్నారు. ఒక్క వేములఘాట్ లోనే 600ల కుటుంబాలకు ప్లాట్‌లు చూపలేదని, అన్ని కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట భూనిర్వాసితులు శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారెడ్డి ఉపేందర్, శ్రీను, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు పాల్గొన్నారు.

'కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలి'



సిద్దిపేట రూరల్: మల్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు

సిద్దిపేట రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని పీఏసీఎస్ చైర్మన్ ములుకల కనకరాజు సూచించారు. నారాయణరావుపేట మండలం మల్యాల, మాటిండ్ల గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ధాన్యం క్వింటాలుకు ఎ గ్రేడ్ రకానికి రూ.2320లు, కామన్ గ్రేడ్ రకాని రూ.2300లు మద్దతు ధరను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు మోహన్‌రెడ్డి, రామచంద్రం, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

దూళిమిట్ట: మండలంలోని లింగాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. గ్రామాల్లో దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కోల సాయిలుగౌడ్, ప్రధాన కార్యదర్శులు గద్దల మహేందర్, ఉట్ల శ్రీధర్‌రెడ్డి, సందింటి లక్ష్మీరెడ్డి, గద్దల చంద్రయ్య బండి చంద్రయ్య, ముక్క కనకయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు గునుకుల రామిరెడ్డి, తాడెం సతీష్, రాజయ్య, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లి మల్లన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

- పట్నాలు వేసి మీసాల దేవుడికి మొక్కుల చెల్లింపు

చేర్యాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామిని ఆదివారం భక్తులు భారీగా దర్శించుకున్నారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఈ సందర్భంగా భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. సంప్రదాయబద్ధంగా మట్టికుండలో బోనంచేసి భక్తిప్రపత్తులతో చలక, నజరు, ముఖ మండప పట్నాలువేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడి బియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాకపెట్టి ఒడిబియ్యాలు పోశారు. అలాగే పట్నాలు వేసిన భక్తులతో ముఖమండపం, గంగిరేగు చెట్టు ప్రాంగణాలు సందడిగా మారాయి. తమ కోరికలు నెరవేర్చమని వేడకుంటూ గంగిరేగు చెట్టుకు భక్తులు ముడుపులు కట్టారు. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ సురేందర్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లుపర్యవేక్షించారు.



రాజగోపురం ఆవరణలో భక్తుల కోలాహలం

బుకింగ్ కార్యాలయం వద్ద తిప్పలు

లక్షలాది రూపాయలు వెచ్చించి బుకింగ్ కార్యాలయం నిర్మించినా భక్తులు గంటలతరబడి నిలబడే ఆవరణలో నిలువనీడ ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. టికెట్ల కోసం భక్తులు పడిగాపులు కాస్తున్నారు. జాతర సమయంలో చలువ పందిళ్ల ఏర్పాటు చేసిన ఆలయాధికారులు ఇతర రోజులలో శాశ్వత నీడ ఏర్పాటుకు చర్యలు తీసుకోకపోవడంతో తిప్పలు తప్పడం లేదు.

ప్రారంభానికి నోచని యోగాషెడ్

- రూ. 6 లక్షల వ్యయంతో నిర్మాణం
- మాస్టర్లను నియమించి వినియోగంలోకి తేస్తే ప్రయోజనం



మద్దూరులోని యోగాషెడ్

మద్దూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం కోసం నేషనల్ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా షెడ్లు ఆశించిన ప్రయోజనాలను చేకూర్చడం లేదు. పాలకుల, జిల్లా వైద్యాధికారుల నిర్లక్ష్యం మూలంగా నిరుపయోగంగా తయారయ్యాయి. రాష్ట్రంలోని 33 జిల్లాలకు 421 యోగా షెడ్లు మంజూరయ్యాయి. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.6 లక్షల చొప్పున రూ.52.26 కోట్లు వెచ్చించి నిర్మించారు. అందులో భాగంగానే మద్దూరు మండల కేంద్రంలోని యునానీ దవాఖానకు యోగా షెడ్డు మంజూరైంది. పనులు చేపట్టిన గుత్తేదారులు నాణ్యత లేమితో పనులు పూర్తి చేశారన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తమయ్యాయి. జిల్లా వైద్యాధికారులు యునానీ దవాఖానలో వైద్యాధికారిని అందుబాటులో ఉంచి సేవలు అందే విధంగా చూసి ఈ యోగా షెడ్డును వినియోగంలోకి తీసుకురావడానికి యోగా మాస్టర్లను నియమించి ప్రజల ఆరోగ్య రక్షణకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మహా పాదయాత్రను విజయవంతం చేయాలి

- మాల మాహానాడు నాయకులు

చేర్యాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలో ఇటీవల భద్రాచలం నుంచి చేపట్టిన మహా పాదయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం ఆ సంఘం నాయకులు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహావరణలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో జాతీయ మాల మాహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ, నాయకులు పుట్ట రాజు, పుట్ట మల్లికార్జున్, కల్లాటి పృథ్వీరాజ్, చింతల విజయ్, చంద శ్రీకాంత్, పాకనాటి భాస్కర్, పుట్ట అయిలయ్య, అనిమల్ల శేఖర్, బడుగు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాగ్నిహోత్రంతో ఎన్నో ప్రయోజనాలు



కడ్వల్‌లో అగ్ని హోత్రంలో గ్రామస్థులు

కల్హేర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నిత్యాగ్నిహోత్రం నిర్వహించడం వల్ల ఎన్నో లాభాలున్నాయని, మరెన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని విశ్వ ఫౌండేషన్ బాధ్యుడు రుద్రప్ప పేర్కొన్నారు. ప్రతిరోజూ సూర్యోదయం, సూర్యాస్తమయం సమయాల్లో అగ్నిహోత్రం నిర్వహించాలని సూచించారు. ఆదివారం ఉదయం సిర్గాపూర్ మండల పరిధిలోని కడ్వల్ గ్రామంలో రుద్రప్ప ఆధ్వర్యంలో అగ్నిహోత్ర కార్యక్రమం నిర్వహించారు. అగ్నిహోత్రం వల్ల వెలువడే వాయువులతో కాలుష్య నిర్మూళన జరుగుతుందని, మానసిక ఒత్తిడి తగ్గుతుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో సిర్గాపూర్ మాజీ జడ్పీటీసి రాఘవరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చేర్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం చుంచనకోటకు చెందిన ఏశబోయిన సంజీవులుకు చెందిన పాడి గేదె వ్యవసాయబావి సమీపంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకున్నది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారీలాగే వ్యవసాయ పనులకు వెళ్లిన సంజీవులు పొలంపనుల్లో నిమగ్నమై ఉండగా, పాడిగేదె గడ్డిమేస్తూ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృత్యువాతపడింది.

నిధులున్నా.. పనులు ముందుకు సాగవేం

- మంత్రి ఆదేశంతో వారంలో చేపడుతానన్న కాంట్రాక్టర్
- నెల దాటినా పూర్వస్థితే
- రోడ్డు పనులూ ఆగిన వైనం



జిల్లా అభివృద్ధి సమావేశంలో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ (ఫైల్)

దూళిమిట్ట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చాలా పనులు నిధులు లేక ముందుకు సాగవు అదీ అందరికీ తెలిసిన విషయమే. కానీ నిధులు మంజూరైనా పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందన మారింది సెంట్రల్ లైటింగ్ పనుల తీరు. మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై దాదాపు రెండు కిలోమీటర్ల మేర సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం గత ప్రభుత్వం దాదాపు రూ.4కోట్ల 80లక్షలు మంజూరు చేసింది. కానీ కాంట్రాక్టర్ పనులను ఇప్పటివరకు చేపట్టలేదు. ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో రాత్రి వేళ ప్రయాణికులకు, వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు.

మూలిగే నక్క మీద తాటికాయలా

మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్లుగా అక్కడ మరొక చిక్కు వచ్చి పడింది. ఆర్‌అండ్‌బీ పరిధిలోని ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పాడ్డాయి. వాటిని పూడ్చేందుకు తారు రోడ్డు వేస్తే సెంట్రల్ లైటింగ్ కోసం మళ్లీ గుంతలు తీస్తారు. దీంతో రోడ్డు మళ్లీ వేయాల్సి వస్తుందనే ఉద్దేశంతో ఆర్అండ్‌బీ అధికారులు గుంతలను పూడ్చే దిశగా అడుగులు వేయడం లేదు. సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టకపోవడంతో ప్రధానరహదారి రోడ్డు పనులు కుడా నిలిచిపోయాయి. రోడ్డుకు ఇరువైపులా ప్లాట్లు ఉన్న కొందరు యజమానులు బిల్డింగ్ నిర్మాణాలు ప్రారంభించుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ సెంట్రల్ లైటింగ్, రెండు వరుసల ప్రధాన రహదారి ఎక్కడి వరకు వస్తుందో అనే సందిగ్ధంతో వారు మిన్నుకుండిపోయారు.

మంత్రి ఆదేశించినా.. అంతే

ఇటీవల నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన మంత్రి కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని కాంట్రాక్టర్ మంత్రితో జరిగిన సంభాషణలో వెల్లడించాడు. నెల రోజులు గడుస్తున్నా పనులు మాత్రం మొదలు కాలేదు. సెంట్రల్ లైటింగ్ పనులను త్వరగా ప్రారంభించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని మండల ప్రజలతో పాటు దూళిమిట్ట గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పనులు ప్రారంభించాలి

సెంట్రల్ లైటింగ్ పనులను త్వరగా ప్రారంభించాలి. ఇప్పటివరకు సెంట్రల్ లైటింగ్ ఎక్కడ వస్తుంది. రెండు వరుసల ప్రధాన రహదారి ఎక్కడి వరకు వస్తుందో తెలిపేలా మార్కింగ్ కూడా చేయలేదు. త్వరగా మార్కింగ్ చేసి సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించాలి. ప్రధాన రహదారి అంతా గుంతలమయంగా మారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

- కృష్ణ, చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్